క్లుప్తంగా

పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా..



ఎమ్మెల్సీ విక్రాంత్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న శ్యామ్

రాజాం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి సైనికుడిలా పని చేస్తానని, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడమే కాకుండా.. బాధితులకు అండగా ఉంటామని ఆ పార్టీ రాజాం నియోజకవర్గ ఎంప్లాయీస్, పెన్షనర్స్ విభాగం అధ్యక్షుడు పాలవలస శ్యామ్ అన్నారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ను పార్టీ కార్యాలయం వద్ద బుధవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ అధ్యక్షుడిగా తాతయ్యలు ఎన్నిక



కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడిని సత్కరిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

మెంటాడ: వాసవీ క్లబ్ అధ్యక్షుడిగా మండలంలోని గుర్ల తమ్మిరాజుపేట గ్రామానికి చెందిన మమ్మిడి శెట్టి తాతయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని ఆండ్ర గ్రామంలో బుధవారం మేఘా వాసవీ క్లబ్‌ను ప్రారంభించారు. కార్యక్రమానికి వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఇ.రామకృష్ణతో పాటు గవర్నర్ కుసుమంచి రాయకృష్ణ హాజరయ్యారు. అనంతరం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆండ్ర ఏఎస్ఐ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

'భవిత'లో మనోవ్యాధి దినోత్సవం



మాట్లాడుతున్న ఎంఈఓ-2 పాపారావు

తెర్లాం: స్థానిక భవిత కేంద్రంలో ప్రపంచ మనోవ్యాధి దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఈఓ-2 ఆర్.పాపారావు హాజరై విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మండల ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు మనోవ్యాధిగ్రస్తులైన పిల్లలకు అర్థమయ్యే రీతిలో విద్యా బోధన చేయాలన్నారు. వారికి ఆటపాటల్లో తర్ఫీదునివ్వాలని కోరారు. భవిత కేంద్రానికి హాజరు కాలేని మానసిక వైకల్యం గల పిల్లల ఇళ్లకు వెళ్లి వారికి విద్యను బోధించాలని సూచించారు. కార్యక్రమంలో తెర్లాం ఎంపీఈ స్కూల్ హెచ్ఎం మేరీగ్రేస్, ఉపాధ్యాయులు, ఐఈటీఆర్ ఉపాధ్యాయుడు సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు అందేలా కృషి



సతివాడ వద్ద తోటపల్లి కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

తెర్లాం: మండలంలోని సతివాడ పరిసర గ్రామాల్లోని పంట పొలాలకు తోటపల్లి ప్రధాన కుడి కాలువ నుంచి పిల్లకాలువ ద్వారా సాగునీరు అందేలా కృషి చేస్తానని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. మండలంలోని తోటపల్లి ప్రధాన కుడి కాలువ, పిల్ల కాలువలతో పాటు, సతివాడలోని చెరువులను బుధవారం ఆయన క్షేత్ర స్థాయిలో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సతివాడలో సాగునీటి సమస్య తన దృష్టికి వచ్చిందని, పంట పొలాలకు సాగునీరు అందించేందుకు సాధ్యాసాధ్యాలు తెలుసుకొనేందుకు క్షేత్ర స్థాయిలో పర్యటించానన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో మాట్లాడి సాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. అలాగే తోటపల్లి పిల్లకాలువ ఆక్రమణలు తొలగించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఆయనతో పాటు బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ వెంకటనాయుడు, మాజీ ఎంపీపీ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ హేమంత్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సంఘాల బలోపేతానికి కృషి

బాడంగి: మండలంలోని పొదుపు సంఘాల బలోపేతానికి గ్రామైఖ్య సంఘ సహాయకులు, ఎన్యూమరేటర్లు కృషి చేయాలని ఏపీఎం ఎ.రత్నకుమార్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయ సమావేశ భవనంలో వీఓఏలు, ఎన్యూమరేటర్లకు మూడు రోజులశిక్షణలో భాగంగా తొలిరోజు శిక్షణ బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాల సభ్యుల వారీ వార్షిక రుణాలు, జీవనోపాదుల ప్రణాళికల తయారీపై అవగాహన కోసం ఈశిక్షణ నిస్తున్నట్టు చెప్పారు. రామభద్రాపురం ఎఫ్‌టీఓ ఏపీఎం పి.సత్యనారాయణ, సీసీలు పాల్గొన్నారు.

అపరాలకు ఆశించిన ధర లేదు..!

- మినప, పెసర పంటల విక్రయాలకు రైతుల తంటాలు
- దళారీలకే విక్రయాలు
- కొనుగోలు కేంద్రాలు, మద్దతు ధర లేక పాట్లు



రాజాంలో ఓ మిల్లు వద్ద దళారీలు కొనుగోలు చేసిన అపరాలు

రాజాం : ఖరీఫ్ అనంతరం రైతులు ఎక్కువగా రబీలో అపరాల పంటలు సాగు చేస్తుంటారు. పెట్టుబడి పెద్దగా లేని ఈ పంటల సాగులో రైతులకు ఎంతో గిట్టుబాటు ఉంటుంది. మంచి ఆదాయం లభిస్తుంది. గతేడాది వరకూ రైతులకు ఈ పరిస్థితి ఆశ కల్పించింది. ప్రస్తుతం పరిస్థితి మారింది. అపరాలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడం లేదు. అదే సమయంలో కొనుగోలు కేంద్రాలు లేవు. దీంతో రైతులు దళారీలనే ఆశ్రయించాల్సి వస్తుంది. ఇదే అదనుగా దళారీలు తాము అనుకున్న ధరకే కొనుగోలు చేస్తున్నారు. నచ్చితే రైతులు విక్రయాలు చేయడం లేదంటే వేరే చోటకు విక్రయించడం చేయాల్సి వస్తుంది. దళారీలు అంతా సిండికేట్ కావడంతో అపరాల పంటకు మార్కెట్‌లో డిమాండ్ ఉన్నా రైతు విక్రయించుకునేందుకు మాత్రం ఎదురీత తప్పడం లేదు.

మధ్యస్థ ధర

మార్కెట్‌లో క్వింటా మినుములు ధర రూ.7000లకు పైగా ఉంది. పెసర క్వింటా ధర రూ.8400లు వరకూ పలుకుతోంది. దళారీలు మాత్రం రైతులకు ముందస్తు అడ్వాన్స్‌లు చెల్లించి, మార్కెట్‌లో ధర లేదని నమ్మబలికి క్వింటా మినుములు రూ.6500లు, పెసర రూ.7300 నుంచి రూ.7400లు మధ్య కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులకు చేతికందివచ్చే ఆదాయం తగ్గుతుంది. ఎకరా సాగులో రైతులకు ఈ ఏడాది 2 నుంచి 4 క్వింటాళ్ల మధ్య అపరాల పంటల దిగుబడి వచ్చింది. వీటి ధర గతేడాదితో పోల్చుకుంటే క్వింటా వద్ద రూ.500లు కనీసం తగ్గుదల ఉండడంతో ఆశించిన ఆదాయం రైతులకు కనిపించడం లేదు. వీటికి తోడు పండించిన పంటను విక్రయించేందుకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేకపోవడం, దళారీలు సిండికేట్‌గా ఏర్పడి, రైతుకు గిట్టుబాటయ్యే ధర చెల్లించకపోవడంతో అవస్థలు తప్పడం లేదు.

తక్కువ పెట్టుబడి

ఈ ఏడాది రబీలో నియోజకవర్గంలో 15 వేల ఎకరాల్లో అపరాల పంటలు సాగు అయ్యాయి. తక్కువ పెట్టుబడితో పాటు మంచి ఆదాయం వస్తుందనే ఆలోచనతో రైతులు వీటిని వేశారు. ఈ విత్తనాలు గత ప్రభుత్వం రాయితీతో ఇస్తే ఈ ప్రభుత్వం పూర్తిగా పంపిణీ చేయలేదు. పంట మార్పిడి విధానంతో పాటు దిగుబడి బాగుంటుందని రైతులు సొంతంగా విత్తనాలు కొనుగోలు చేసి మినప, పెసర పంటలు సాగుచేస్తే దళారీలు సిండికేట్‌గా వ్యవహరించి ధరలు నియంత్రిస్తున్నారు. ఈ విషయంపై వ్యవసాయ శాఖ ఏడీఏ చంద్రరావు వద్ద సాక్షి ప్రస్తావించగా అపరాల పంటలకు ఈ ప్రాంతంలో మద్దతు ధర లేదని, రైతులు వ్యాపారుల ద్వారా ఆదాయ మార్గాలు చూసుకోవాలని సూచించారు.

దళారీలే కొంటున్నారు..

మా వద్ద మినప పంటను దళారీలే కొన్నారు. ఫిబ్రవరి మొదటి వారంలో విపరీతంగా మినుములకు ధర వచ్చింది. క్వింటా రూ.7వేల దాటి కొనుగోలు చేశారు. ఇప్పుడు ఒక్కసారిగా మొఖం చాటేస్తున్నారు. రూ.6500లకు మించి కొనుగోలు చేయడం లేదు. ఇతర ప్రాంతాలకు విక్రయిస్తే డబ్బులు ముడతాయో లేదో భయమేస్తోంది. అందుకే తక్కువ ధరకే మినుములు అమ్మేస్తున్నాం. – ఎస్.రామారావు, రైతు, వన్నలి, రేగిడి మండలం

ధర పడిపోయింది.

పెసర పంటకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. దళారీలు కొనుగోలు చేయడంలో మోసం చేస్తున్నారు. విజయవాడ, చీరాల, గుంటూరు వంటి ప్రాంతాల్లోని వ్యాపారులకు పెద్ద ఎత్తున విక్రయిస్తే కొనుగోలు చేస్తారు. ఒక రైతుకు మూడు నాలుగు క్వింటాళ్లకు మించి ఎక్కువ పంట దిగుబడి లేదు. దూర ప్రాంతాల్లోని వ్యాపారులను నమ్మలేక, దగ్గర్లోని దళారీలకే ఏదో ఒక రూపంలో పెసలు విక్రయిస్తున్నాం. వీటి ధర ఆశించినంతగా లేదు.

– ఎం.గణనాథ, రైతు, రాజాం మండలం

క్రమబద్ధీకరణకు అర్హులను గుర్తించండి



వీఆర్‌ఓల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీను

బొబ్బిలి రూరల్: ప్రభుత్వ భూములను ఆక్రమించి స్థిర నివాసాలను ఏర్పాటు చేసుకున్న వారి వివరాలు, వారి అర్హతలను వీఆర్‌ఓలు గుర్తించాలని తహసీల్దార్ ఎం.శ్రీను సూచించారు. తన కార్యాలయంలో వీఆర్‌ఓలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఓ నంబరు 30 ప్రకారం ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్న అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని ప్రభుత్వ షరతుల మేరకు శాశ్వతంగా వారికి చెందేలా చర్యలు చేపట్టాలన్నారు. రేషన్ కార్డుల ఈకేవైసీ గడువును ఈ నెలాఖరు వరకు పెంచిందని లబ్ధిదారులకు అవగాహన కల్పించి పూర్తి స్థాయిలో జరిగేలా చూడాలన్నారు. రానున్న రోజుల్లో లబ్ధిదారులకు రేషన్ కార్డులను స్మార్ట్ కార్డుల రూపంలో ఇవ్వనున్నట్లు దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రైతులు భూ రీసర్వేల్లో తప్పులను సవరించేందుకు అవకాశం ఉందని రైతులకు వివరించాలని తెలిపారు. సమావేశంలో ఆర్ఐ రామకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తూముల అచ్యుతవల్లి తదితరులు

బొబ్బిలి: పట్టణానికి చెందిన నైటింగేల్ మహిళా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు, మాజీ మున్సిపల్ చైర్మన్ తూముల అచ్యుతవల్లి ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏటా చలివేంద్రాలను నిర్వహిస్తూ పాదచారులకు దాహార్తిని తీర్చడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు.

జీవనోపాధికి రుణ ప్రణాళికలు



రుణ ప్రణాళికలపై మహిళా సమాఖ్య సభ్యులకు వివరిస్తున్న డీపీఎం

బొబ్బిలి రూరల్: మహిళా పొదుపు సంఘాల సభ్యులు తమ జీవనోపాధికి సరైన ప్రణాళికతో ముందుకు వస్తే అవసరమైన రుణాలను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని జిల్లా ఫైనాన్స్ డీపీఎం జె.లక్ష్మణరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గ్రామైఖ్య సంఘాల సభ్యులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 1787 పొదుపు సంఘాలుండగా సుమారు 20వేల 506 మంది సభ్యులుగా ఉన్నారని తెలిపారు. జీవనోపాధికి అవసరమైన శిక్షణ కోసం ఎనిమిది సంఘాలకు ఒక ఎన్యూమరేటర్ చొప్పున 223 మంది ఎన్యూమరేటర్ల ద్వారా ఈ నెల 7 వరకు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను సభ్యులకు వివరించాలని, తద్వారా రుణ ప్రణాళికలు ఉంటాయన్నారు. ప్రభుత్వం ఇచ్చే రుణాలను సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలుండాలని వివరించారు. సమావేశంలో ఏపీఎం భాగ్యలక్ష్మి, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

తాగునీటి పరీక్షలు వెంటనే చేయండి



సిబ్బందితో సమీక్షిస్తున్న కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: పట్టణంలో సరఫరా అవుతున్న తాగునీటిని అవసరమైన నిర్దిష్ట ప్రమాణాల మేరకు నాణ్యతా పరీక్షలు చేసి నివేదిక సమర్పించాలని సిబ్బందిని కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఆమె తన చాంబర్‌లో వేసవి దృష్ట్యా తాగునీటి సరఫరాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాన నీటి వనరు ప్రాంతంలో ఇన్‌ఫిల్టరేషన్ బావులకు మరమ్మతులు చేపట్టాలన్నారు. పట్టణంలో తాగునీటి సరఫరాలో లీకులు ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కుళాయి హెడ్లు అన్ని ప్రాంతాల్లో ఉండేటట్లు చూడాలన్నారు. పైలట్ వాటర్ స్కీంలను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలన్నారు. తాగునీటి పొదుపుపై పట్టణంలో మైక్‌ల ద్వారా ప్రచారం చేయాలన్నారు. పట్టణంలో జన సంచారం ఉన్న చోట్ల వెంటనే చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. డీఈ కిరణ్‌కుమార్, ఏఈ గుప్త తదితరులున్నారు.

భోజనం చేయకుండానే.. ఇంటి దారి



మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటికి వెళ్లిపోతున్న విద్యార్థులు

రామభద్రపురం: స్థానిక ఉన్నత పాఠశాలకు చెందిన డ్రాయింగ్ టీచర్ పదవీ విరమణ కావడంతో ఉపాధ్యాయులంతా ఆయన సన్మాన కార్యక్రమంలో హడావుడిగా ఉండగా.. అదే సమయంలో విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేయకుండానే 12 గంటల సమయంలో ఇంటి దారి పట్టారు. ఈ పాఠశాలలో సుమారు 800 మంది విద్యార్థులు చదువుతుండగా వీరికి 40 మంది ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులకు భోజనం పెట్టి ఇంటికి పంపించాల్సిన ఉపాధ్యాయులు దాన్ని మరచి సన్మాన కార్యక్రమంలో ఉండగా ఆకలి కడుపులతోనే పలువురు విద్యార్థులు ఇంటి ముఖం పట్టారు. దీనిపై పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పెదవి విరిచారు.

సంక్షిప్తంగా...

నెలాఖరు వరకు ఈకేవైసీ గడువు

రాజాం సిటీ: మండలంలోని పెండింగ్‌లో ఉన్న రేషన్ లబ్ధిదారులకు ఈకేవైసీ వేగవంతంగా పూర్తి చేయాలని సీఎస్‌డీటీ ఎస్.చిరంజీవరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఇంకా 7వేల మంది పైబడి పెండింగ్‌లో ఉన్నారని, వీరందరినీ గుర్తించి ఈ నెల 30లోగా పూర్తి చేయాల్సిన బాధ్యత వీఆర్వోలు, డీలర్లపై ఉందన్నారు. సంబంధిత లబ్ధిదారులు కూడా వారికి సహకరించాలని కోరారు.

అభినందన

రాజాం సిటీ: రాజాం రచయితల వేదిక నిర్వాహకులు గార రంగనాధంకు వేదిక సభ్యులు బుధవారం అభినందించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉగాది పురస్కారాన్ని అందుకున్న విషయం విదితమే. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రా.ర.వే సభ్యులు పిల్లా తిరుపతిరావు, పొదిలాపు శ్రీనివాసరావు, డాక్టర్ ఆల్తి మోహనరావు, రాజాపు శాంతారావు, సమతం మహేశ్వరరావు పుస్తకం బహుకరించి అభినందించారు.

బోర్లు మరమ్మతులు

వంగర: మండల పరిధి ఇరువాడ, కోణంగిపాడు గ్రామాల్లో తాగునీటి బోర్లు బుధవారం మరమ్మతులు చేపట్టారు. కొంతకాలంగా మూలకు చేరిన బోర్లను క్రాస్ ప్రోగ్రాంలో భాగంగా మెకానిక్‌లు కళింగ కృపారావు, వెంకటరమణ, రామకృష్ణలు బాగు చేసి తాగునీటి సరఫరా చేశారు.

మహిళలు ఆర్థిక వృద్ధి సాధించాలి

వంగర: మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలని ఏపీఎం టి.మంగమ్మ అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళలు జీవనోపాదుల కోసం వార్షిక ప్రణాళిక తయారీకి వీఓఏలు, ఎన్యుమరేటర్లుకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమం ప్రారంభించి మాట్లాడారు. మహిళలు అన్నింటా అభివృద్ధి చెందేందుకు రుణాలు మంజూరు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. స్పెషల్ ఆఫీసర్ మూవీ సుధాకర్, ఎంఎంఎస్ అధ్యక్షురాలు బెవర రామలక్ష్మి, సీసీలు పాల్గొన్నారు.

నేడు ఇంటర్వ్యూలు

రాజాం సిటీ: మున్సిపాల్టీ కార్యాలయ ఆవరణలో బీసీ, కాపు కార్పొరేషన్ రుణాలకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని కమిషనర్ జె.రామప్పలనాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాల్టీలో 385 దరఖాస్తులు వచ్చాయని వీరంతా ఉదయం 10 గంటలకు దరఖాస్తుతో పాటు కుల, ఆదాయ, రైస్, ఆధార్ కార్డులతో హాజరు కావాలని అన్నారు.

సజావుగా ఇంటర్వ్యూలు

రాజాం : మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బీసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 480 మంది దరఖాస్తు చేసుకోగా, 50 శాతం రాయితీతో ఈ రుణాలు అందించనున్నట్లు ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు వెల్లడించారు. మొత్తం 83 యూనిట్లుకు సంబంధించి రూ.1.78 కోట్ల రుణాలు ఇవ్వనున్నట్లు, ఈ మేరకు లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని అన్నారు.

పంటల సాగు పరిశీలన

బొబ్బిలి రూరల్: రైతులు పండిస్తున్న పంటల సాగు విధానాన్ని వ్యవసాయ శాఖ శాస్త్రవేత్త లక్ష్మణరావు బుధవారం పరిశీలించారు. మండలంలోని మెట్టవలస గ్రామంలో బుధవారం ఏడీ శ్యాంసుందర్‌తో కలసి పంట పొలాలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రీయ పద్ధతుల్లో వ్యవసాయమే మేలని, రసాయిన రహిత పంటలకు రానున్న రోజుల్లో మంచి ఆదాయం లభిస్తోందని వివరించారు. అనంతరం రైతుసేవా కేంద్రంలో పంటల సాగు ప్రణాళిక ప్రతులను రైతులకు అందజేశారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

మెంటాడ: మండల పరిషత్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు ఎంపీడీఓ కె.భానుమూర్తి బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలానికి 62 యూనిట్లు మంజూరు చేయగా 464 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వారి ధ్రువపత్రాలు పరిశీలన పూర్తయినట్టు తెలిపారు. ఈఓపీఆర్‌డీ విమలకుమారి, సీనియర్ సహాయకులు శర్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళల్లో ఆర్థిక అక్షరాస్యత అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ రత్నాకర్

రేగిడి : డ్వాక్రా సంఘాల్లోని మహిళల్లో ఆర్థిక అక్షరాస్యత, అభివృద్ధి అవసరమని సెర్ప్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.రత్నాకర్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండలంలో పలు గ్రామాలకు చెందిన వీఓఏలు, ఎన్యుమరేటర్లుకు బుధవారం శిక్షణ నిర్వహించారు. శిక్షణలో భాగంగా బ్యాంకుల ద్వారా రుణాలు పొందడం, వాటిని సక్రమంగా వినియోగించడం, చెల్లించడం వంటి అంశాలపై మాట్లాడారు. వీటి నిమిత్తం సమగ్ర ప్రణాళికలు అవసరమని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

మీకో దండం... మా బడిని ఇక్కడే ఉంచండి



కూటమి ప్రభుత్వం సంస్కరణల పేరిట ఫౌండేషన్ స్కూళ్లగా గుర్తించిన ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5 తరగతులను తొలగించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఆ కుట్రలో భాగంగా మండల కేంద్రంలోని గువ హరిజన వీధి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను వేరే పాఠశాలలో కలిపేందుకు సన్నాహాలు చేస్తోందని సమాచారం ఉంది. దీంతో ఆ పాఠశాల ఆవరణలో విద్యార్థులు, తల్లిదండ్రులు బుధవారం కాసేపు పాఠశాల ఆవరణలో ఒంటి కాలిపై నిల్చుని నిరసన తెలిపి తమ పాఠశాలను ఇక్కడే ఉంచాలని వేడుకున్నారు. – రామభద్రపురం

పరాయి పంచన సంచార ఆరోగ్యసేవ వాహనం



గ్రామీణ ప్రాంతాల్లోని పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పశు సంచార ఆరోగ్యసేవ వాహనాలను ప్రవేశ పెట్టింది. నేడు ఈ వాహనాలు పశు వైద్య కేంద్రాల వద్ద ఉంచేందుకు ఎటువంటి షెల్టర్ లేకపోవడంతో ఎండకు ఎండి, వానకు తడుస్తుండడంతో పాటు, వాహనాన్ని సంబంధిత అధికారులు, సిబ్బంది పరాయి పంచన ఉంచాల్సిన పరిస్థితి నెలకొంది. తెర్లాం మండలానికి కేటాయించిన పశు సంచార ఆరోగ్యసేవ వాహనం స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద ఉంచుతున్నారు. ఏ గ్రామంలో పశువులకు బాగాలేదని ఫోన్ వస్తే వెంటనే ఇక్కడ నుంచే వాహనాన్ని సిబ్బంది తీసుకువెళ్తున్నారు. – తెర్లాం

ప్రారంభమెప్పుడో..!



మండలంలోని బూసాయవలస కేజీబీవీ జూనియర్ కళాశాలకు నూతన భవన నిర్మాణం పూర్తయింది. గత ప్రభుత్వం మంజూరు చేసిన నాడు – నేడు నిధులు రూ.160 లక్షల అంచనా విలువలతో నిర్మించారు. ఈ భవనం పూర్తయి నెలలు దాటుతున్నా ప్రారంభానికి నోచుకోలేదు. ఇక్కడ జూనియర్ కాలేజీ విద్యార్థులు ఇరుకు గదులలోనే కూర్చుని చదువుకోవాల్సి వస్తోంది. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా.. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభోత్సవానికి చొరవ చూపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. – రామభద్రపురం

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



తాటిపాడులో మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

రేగిడి : పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అంటూ రాజాం జీఎంఆర్ఐటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించారు. మండలంలోని తాటిపాడు గ్రామంలో జీఎంఆర్ఐటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సేవా శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలకు చెట్ల ఆవశ్యకతను తెలియజేయడంతో పాటు ప్రజల సమక్షంలో మొక్కలు నాటి, వాటిని పెంచే బాధ్యత గ్రామంలోని సామాజిక కార్యకర్తలకు, యువతకు అప్పగించారు. జీఎంఆర్ఐటీ ఎన్ఎస్ఎస్ విభాగం ద్వారా గ్రామంలో వారం రోజుల పాటు సేవా కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కేవీఎస్. ప్రసాద్, డీన్స్ డాక్టర్ వి.రాంబాబు, కె.రవీంద్రనాథ్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, పంచాయతీ పెద్దలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కూడలి



ప్రమాదకరంగా మారిన దొంకలమిల్లు కూడలి

రాజాం సిటీ: రాజాం – పాలకొండ ప్రధాన రహదారిలోని దొంకలమిల్లు వద్ద మూడు రోడ్లు కూడలి ప్రమాదకరంగా మారింది. రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డు వేసినప్పటికీ ఆ ప్రదేశంలో స్పీడు బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇటీవల అదే జంక్షన్ వద్ద రోడ్డు దాటుతున్న మహిళను ద్విచక్ర వాహనంతో ఢీకొనడంతో గాయాల పాలైన విషయం విదితమే. అలాగే సంతకవిటి వెళ్లే రోడ్డులో జంక్షన్‌కు ఆనుకుని ఆటోలు సైతం రోడ్డు పక్కనే నిలుపుదల చేయడం ఇబ్బందిగా ఉందని పలువురు వాహనదారులు వాపోతున్నారు. మూడు రోడ్ల జంక్షన్ కావడంతో ఎప్పుడు ఏం ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులతో పాటు స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

కూటమి కార్యకర్తలకే బీసీ రుణాలు



సమావేశంలో మాట్లాడుతున్న కరణం శ్రీనివాసరావు

రేగిడి : కూటమి ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ రాయితీ రుణాల్లో అర్హులు లేరని, అధికార పార్టీకి చెందిన కార్యకర్తలకే ఈ రుణాలు కేటాయిస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు ఆరోపించారు. బుధవారం రేగిడిలో విలేకరులతో మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేయూత, చేదోడు పథకాల పేరుతో బీసీలకు అండగా నిలిచిందని గుర్తు చేశారు. రాయితీతో పరికరాలు అందివ్వడం, వడ్డీలేని రుణాలు ఇవ్వడం చేసిందని వెల్లడించారు. పార్టీలకు అతీతంగా కుల వృత్తులు వారు ఉండేవారని, ఇప్పుడు ఈ ప్రభుత్వం ఒక్క కుల వృత్తి లబ్ధిదారున్ని కూడా ఎంపిక చేయలేదని ఆరోపించారు. ఇప్పటికైనా పార్టీలకు అతీతంగా బీసీ కార్పొరేషన్ రుణాలు ఇవ్వాలని, ఇవి కూడా కుల వృత్తులు వారికి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మీపురం సర్పంచ్ కెంబూరి తేజోవతి, కెంబూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.